క్లుప్తంగా

'ఆధార్' అప్డేట్ మేళా

పెర్కిట్(ఆర్మూర్): సుర్బిర్యాల్‌లో శుక్రవారం స్థానిక సర్పంచ్ సల్లపల్లి సవిత ఆధార్ కార్డు అప్డేట్ మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. వృద్ధులు, వికలాంగులు ఆర్మూర్ వెళ్లి ఆధార్ కార్డు అప్డేట్ చేసుకోవడం ఇబ్బందిగా ఉండటంతో గ్రామంలో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్‌డేట్ చేసుకోకపోతే మార్చి నుంచి సంక్షేమ పథకాలను నిలిపేస్తామని తెలిపారు.

జీపీ భవనానికి భూమిపూజ



బోధన్ రూరల్ (బోధన్): రాంపూర్‌లో నూతన జీపీ భవన నిర్మాణ పనులను స్థానిక సర్పంచ్ ఉమ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మి, ఎన్డీసీసీబీ డైరెక్టర్ శరత్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు సంజీవ్, తదితరులున్నారు.

నోటీసులను ఉపసంహరించుకోవాలి

నవీపేట: లింగమయ్య గుట్ట కాలనీలో నివాసముంటున్న నిరుపేదలకు తహసీల్దార్ జారీ చేసిన నోటీసులను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. సొంతిళ్లు లేని నిరుపేదలు గత 15 ఏళ్లుగా లింగమయ్య గుట్టలోని ప్రభుత్వ భూమిలో ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నారని పేర్కొన్నారు. వీరికి ఇంటి నంబర్లు, కరెంట్ కనెక్షన్లు తదితర వసతులు కల్పించారని పేర్కొన్నారు. తాజాగా తహసీల్దార్ వీరికి నోటీసులు జారీ చేయడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు.

క్షయ వ్యాధిపై అవగాహన

పెర్కిట్(ఆర్మూర్): మామిడిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా క్షయ వ్యాధి పర్యవేక్షకులు సంతోష్ మాట్లాడుతూ.. అకారణంగా బరువు తగ్గడం, నిరంతరం దగ్గు, రాత్రి పూట చెమటలు పట్టడం, జ్వరం ఉన్నట్టయితే వైద్యున్ని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ సుగుణ, డీపీఎం నరేష్, పాఠశాల హెచ్ఎం గంగారాం, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

కమ్మర్‌పల్లి: ఉప్లూర్ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. హెచ్ఎంగా నవీన్‌కుమార్, ఉపాధ్యాయులుగా అర్వింద్, అఖిల, అక్షయ్, విష్ణువర్ధన్ వ్యవహరించారు. ఉత్తమ బోధకులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

సామాజిక తనిఖీ

మాక్లూర్: ఉపాధి హామీ పనులపై శుక్రవారం ఎంపీడీవో ప్రాంగణంలో డీఆర్‌డీవో చందర్‌నాయక్ పర్యవేక్షణలో సామాజిక తనిఖీ జరిగింది. డిసెంబర్ 1, 2019 నుంచి మార్చి 31, 2022 వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై తనిఖీ చేశారు. ప్రత్యేక బృందం ఫిబ్రవరి 8, 2023 నుంచి ఫిబ్రవరి 23, 2023 వరకు గ్రామాల వారీగా ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద రికార్డులను స్వాధీనం చేసుకొని కూలీలను కూడా అడిగి తగిన సమాచారం సేకరించారు. ఈ తనిఖీలో ఎంపీడీవో క్రాంతి, ఎంపీవో శ్రీనివాస్, ఏపీఎం ఓంకార్ పాల్గొన్నారు.

'కంటి వెలుగు' ప్రారంభం

కమ్మర్‌పల్లి: నాగాపూర్‌లో శుక్రవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ పాలెపు సాయమ్మ ప్రారంభించారు. వైద్యాధికారి డాక్టర్ నరసింహస్వామి, ఎంపీటీసీ దుబ్బాక సుప్రియ, తదితరులు పాల్గొన్నారు.

కోడిచర్లలో..

బాల్కొండ: మెండోరా మండలం కోడిచర్లలో కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం వైస్ ఎంపీపీ సరస్వతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారిణి ప్రణవ, సర్పంచ్ వరిగడ్డి వనిత, ఉప సర్పంచ్ గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందికి సన్మానం

నందిపేట్(ఆర్మూర్): బాద్గుణ గ్రామంలో కంటి వెలుగు సిబ్బందిని శుక్రవారం స్థానిక సర్పంచు చిట్టెడి భోజారెడ్డి సన్మానించారు. ఎనిమిది రోజుల నుంచి ఇంటింటికి తిరుగుతూ గ్రామంలోని ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు విజయవంతంగా చేసిన డాక్టర్లు, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచు నీరడి రవీందర్, చిటిట్టి రవీందర్, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆయిల్‌పాంతో లాభాలు

మోర్తాడ్: ఆయిల్ పాంతో లాభాలను ఆర్జించవచ్చని ఉద్యానవన శాఖ మాజీ డైరెక్టర్ లోక వెంకట్రాంరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ధర్మోరాలో ఆయిల్‌పాం పంట పొలాలను పరిశీలించారు. సాగు చేస్తున్న రైతు సరికెల చిన్న భూమన్నతో మాట్లాడారు. ఆయిల్‌పాం వల్ల నూనె ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి సుమన్, ఆయిల్‌పాం కంపెనీ ఫీల్డు అధికారులు మనోజ్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల సుడిగుండంలో ఆటోనగర్

- కాలనీలో కానరాని సీసీరోడ్లు, డ్రైనేజీలు
- దోమలతోనే స్థానికుల సావాసం
- పట్టించుకునేవారు కరువు



బోధన్ పట్టణంలోని ఆటోనగర్‌కాలనీలో అధ్వానంగా ఉన్న రోడ్డు .. సరైన కాలువలు లేని దృశ్యం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి పరిధిలో గల ఆటోనగర్ సమస్యల సుడిగుండంలో కొట్టు మిట్టాడుతోంది. 18 ఏళ్ల క్రితం ఏర్పడిన కాలనీలో 800 నుంచి 1000 వరకు నివాసాలున్నాయి. ఇంకా కొంత మంది నిరుపేదలు ఇళ్ల నిర్మాణం చేపడుతున్నారు. అయినా కూడా సీసీ రోడ్డు, మురికి కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాటి నుంచి నేటి వరకు మూడు సాధారణ ఎన్నికలు పూర్తయినా వారిని పట్టించుకున్న నాథులే లేరు. ప్రభుత్వం అట్టడుగు వర్గాల ప్రజలకోసం ఇంటి స్థలాలు కేటాయించింది. దీనిలో కొందరు ఇళ్లు కట్టుకొని నివాసముంటున్నారు. రోజు కూలీ చేసుకొని బతికేవారు కొందరు అద్దె ఇళ్లను తీసుకొని జీవనం కొనసాగిస్తున్నారు. కాలనీలో 500 నుంచి 600 మంది ఓటర్లు ఉన్నారు. ఆచన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉండగా మూడేళ్ల క్రితం ఆచన్‌పల్లిని మున్సిపాలిటీలో విలీనం చేయడంతో ఆటోనగర్ సైతం ఒకటో వార్డు పరిధిలోకి వచ్చింది. మూడేళ్ల క్రితం జరిగిన మున్సిపల్ ఎన్నికల సమయంలో వివిధ పార్టీల అభ్యర్థులు వచ్చి తమకు ఓట్లు వేయాలని కాలనీని అభివృద్ధి చేస్తామని చెప్పారే తప్ప ఇప్పటి వరకు సీసీ రోడ్డుకానీ, మురికి కాలువలు గానీ నిర్మించిన పాపాన పోలేదు.

వర్షాకాలం వస్తే అంతే..

వర్షాకాలం వచ్చిందంటే కాలనీలోని రోడ్డు బురదమయంగా మారుతాయి. మురికి కాలువలు లేకపోవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతాయి. దీంతో ఇళ్లలోకి వెళ్లాలంటే కాలనీవాసులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంటుంది. మురికి నీరు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. ఇళ్ల చుట్టూ చెట్లు పెరగడంతో రాత్రి వేళలో పాములు, విష పురుగులు వస్తాయని భయాందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. కాలనీలో దోమల బెడద కూడా ఎక్కువగానే ఉంది. దోమల మందు పిచికారీ చేయాలని పలు మార్లు బల్దియా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.



కాలువలు లేక నిలిచిపోయిన మురికి నీరు

ఆటోనగర్ అభివృద్ధికి కృషి

పట్టణంలోని 1వ వార్డు పరిధి ఆటోనగర్ కాలనీ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే కాలనీలో రూ.5 లక్షలతో నర్సరీ, రూ.8.50 లక్షలతో పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాము. సీసీ రోడ్ల కోసం రూ.10 లక్షలతో పాటు మొరం వేయడానికి రూ.5 లక్షలు ప్రతిపాదనలు పెట్టాం. రూ.4.50 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాం. కాలనీలో సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేస్తాం.

– తాళ్ల లత, వార్డు కౌన్సిలర్

సమస్యలు పరిష్కరించాలి

18 ఏళ్ల క్రితం కాలనీ ఏర్పాటైంది. 12 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు కాలనీలో కనీస వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయి. అనేక సార్లు అధికారులకు కాలనీలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని విన్నవించినా పట్టించుకోలేదు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలి.

–మహ్మద్ ఖాన్, కాలనీవాసి

మురికి కాలువలు నిర్మించాలి

ఆటోనగర్ కాలనీలో నివాసాలు అయినప్పటికీ రోడ్లు, మురికి కాలువలు లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మురికి కాలువల నిర్మాణం లేకపోవడంతో ఇళ్ల ముందు మురికి నీరు నిలువ ఉంటుంది. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి మురికి కాలువలు నిర్మించాలి.

–మల్లేశ్వరీ, కాలనీవాసి

బురద రోడ్లపై నడవాల్సిందే

ఆటోనగర్ కాలనీలోని 8 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. వర్షాకాలం వచ్చిందంటే బురద రోడ్లపై నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీలో కలిసినా కనీస వసతు లు ఏర్పాటు చేయకపోవడం బాధాకరం.

– మధుకర్, కాలనీవాసి

మహిళలపై దాడులను అరికట్టాలి



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

ఆర్మూర్‌టౌన్: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు జెస్సు అనిల్, గిరిజన మోర్చా పట్టణ ఉపాధ్యక్షుడు తిరుపతి నాయక్‌లు అన్నారు. బీజేపీ గిరిజన మోర్చా ఆర్మూర్ శాఖ ఆధ్వర్యంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేధింపుల విషయం గురించి గిరిజన విద్యార్థిని ధారావత్ ప్రీతి, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతోనే చివరికి ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒకవర్గానికి తొత్తుగా మారి దళిత, గిరిజన బిడ్డలపై జరుగుతున్న అరాచకాలను ఆపలేకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఆర్మూర్ అసెంబ్లీ కన్వీనర్ పాలెపు రాజు, నాయకులు తూర్పు రాజు, విజయ సాగర్, ఖాందేశ్ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని విజయవంతం చేయాలి

బాల్కొండ: వేతన సవరణ ఉద్యమాన్ని విజయవంతం చేయాలని టీఎస్ పీఆర్‌సీ జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. వేతన సవరణపై ఏడాది కాలంగా స్పష్టత లేకపోవడంతో శుక్రవారం జెన్‌కో కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రోజు వారీగా నిరసన కార్యక్రమాలు మార్చి 24 వరకు నిర్వహిస్తామన్నారు. అప్పటికీ యాజమాన్యాలు దిగి రాకపోతే ఆ తర్వాత నుంచి నిరవధిక సమ్మెలు కొనసాగిస్తామన్నారు.

వెదజల్లే పద్ధతితో పెట్టుబడి ఆదా

బాల్కొండ: వెదజల్లే పద్ధతితో వరి పంటను సాగు చేయడం వల్ల పెట్టుబడి ఆదా అవుతుందని బాల్కొండ వ్యవసాయ అధికారి మహేందర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిట్టాపూర్‌లో వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తున్న వరి పంటను ఆయన పరిశీలించారు. ఈ పద్ధతి ద్వారా ఒకే వ్యక్తి నాలుగు నుంచి ఐదెకరాల వరకు వరి విత్తనాలను వెదజల్లుకోవచ్చన్నారు. దీంతో కూలీల కొరతను అధిగమించవచ్చన్నారు. ఈ పద్ధతిలో 10 నుంచి 12 కిలోల విత్తనాలు ఎకరానికి సరిపోతాయన్నారు. అలాగే పంట 15 రోజుల ముందుగానే కోతకు వస్తుందన్నారు. యాజమాన్య పద్ధతులు సకాలంలో పాటించి మంచి దిగుబడి పొందవచ్చన్నారు.

కొనసాగుతున్న 'నట్టల' మందు పంపిణీ



ముల్లంగి(బి)లో మందు వేస్తున్న పశు వైద్యులు

మాక్లూర్: ముల్లంగి(బి), బొంకన్‌పల్లి, గొట్టిముక్కల గ్రామాలలో గొర్రెలు, మేకలకు శుక్రవారం పశు వైద్యాధికారులు కిరణ్‌దేశ్‌పాండే, ఉమామహేశ్వర్‌లు నట్టల నివారణ మందులు వేశారు. మండలంలో 13,127 గొర్రెలకు ఉచితంగా నట్టల నివారణ మందు వేసినట్టు వారు ఈ సందర్భంగా తెలిపారు.

కమ్మర్‌పల్లి: నాగాపూర్‌లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. 2560 గొర్రెలు, 105 మేకలకు నట్టల నివారణ మందు వేశారు. సర్పంచ్ పాలెపు సాయమ్మ, ఎంపీటీసీ దుబ్బాక సుప్రియ పాల్గొన్నారు.

రుద్రూర్: సులేమాన్‌నగర్‌లో గొర్రెలు, మేకలకు ఉచిత నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ ఖాదర్ ప్రారంభించారు. అనంతరం వెటర్నరి సిబ్బంది 655 జీవాలకు మందు వేశారు.

కోటగిరిలో..

కోటగిరి మండలం వల్లభాపూర్, దోమలేడ్గీ, టాక్లీ గ్రామాల్లో నట్టల మందు పంపిణీ చేశారు. వల్లభాపూర్ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్, ఉప సర్పంచ్ సాయిలు, దోమలెడ్గి దిగంబర్ పటేల్ పాల్గొన్నారు.

ఆకతాయిల నుంచి రక్షణ కల్పిస్తాం



పెర్కిట్(ఆర్మూర్): మహిళలు, అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఆకతాయిల గురించి ఫిర్యాదు చేస్తే తక్షణమే రక్షణ కల్పిస్తామని షీ టీం ఆర్మూర్ డివిజన్ ఇన్‌చార్జీ ఎస్సై ఇంద్రకరణ్ రెడ్డి భరోసా ఇచ్చారు. పెర్కిట్ కేజీబీవీ విద్యార్థినులకు శుక్రవారం సైబర్ క్రైమ్, షీటీం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఆకతాయిల గురించి ఫిర్యాదు చేసేవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దన్నారు. మహిళలు ఆకతాయిల నుంచి రక్షణ పొందడానికి షీ టీం వాట్సాప్ నెంబరు 8712659795, ఎస్సై నెంబర్ 9440140022, డయల్ 100కు ఫిర్యాదు చేయాలన్నారు. అనంతరం షీటీం క్యూఆర్ ప్రతులను ఆవిష్కరించారు. కేజీబీవీ ఎస్‌వో గంగామణి, కానిస్టేబుల్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్‌పై సమావేశం



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్లు

భీమ్‌గల్: మున్సిపల్ కార్యాలయంలో 2023–24 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌పై మున్సిపల్ చైర్‌పర్సన్ కన్నె ప్రేమలత ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ అకౌంటెంట్ బడ్జెట్‌కి సంబందించి వివరాలు సభ్యులకు తెలియజేస్తూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సొంత నిధులు రూ.3 కోట్ల 5 లక్షలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులు క్యాపిటల్ గ్రాంట్ ద్వారా రూ.14 కోట్ల 63 లక్షలు, డిపాజిట్‌లు రూ.15 లక్షలు కలిపి మొత్తం రూ.17 కోట్ల 83 లక్షలు ప్రతిపాదనలు చేసినట్లు తెలిపారు. అనంతరం పట్టణంలోని సర్వే నంబర్- 27 రథం చెరువు, సర్వే నంబర్-544లో ఉన్న మొగిలి చెరువు, మిర సాగర్ పరిధిలో కబ్జా అయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని కౌన్సిలర్లు తహసీల్దార్ శ్రీధర్‌కి వినతి పత్రం అందజేశారు.

ప్రజల బాగుండాలనే ఆశీర్వాద సభలు

భీమ్‌గల్: పట్టణ కేంద్రంలో జరుగుతున్న సిలువ చర్చ్ ఆశీర్వాద పండుగల కార్యక్రమంలో శుక్రవారం రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందరర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అందరూ సుఖ సంతోషాలతో జీవనం సాగించాలనే ఉద్దేశంతో ఆశీర్వాద సభలు నిర్వహించడం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు షద్రక్, జీవ రత్నం, ఇజ్రాయిల్, డేవిడ్, మాణిక్యాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పంచాయతీ భవనం ప్రారంభం

మోర్తాడ్: ఏర్గట్ల, తాళ్లరాంపూర్‌లలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి ప్రశాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఏర్గట్ల పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించారు. తాళ్లరాంపూర్‌లో ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన నిర్వహించారు. జిల్లా పంచాయ తీ అధికారి జయసుధ, ఎంపీపీ కొలిప్యాక ఉపేంద్ర, జెడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, సహకార సంఘాల చైర్మన్‌లు పెద్దకాపు శ్రీనివాస్‌రెడ్డి, బర్మ చిన్న సర్సయ్య, సర్పంచ్‌లు గుల్లె లావణ్య, భానుప్రసాద్, వైస్ ఎంపీపీ లావణ్య, ఎంపీటీసీ మధు పాల్గొన్నారు.


భక్తిమార్గాన్ని అలవర్చుకోవాలి

నందిపేట్(ఆర్మూర్): ప్రతి ఒక్కరు భక్తి మార్గాన్ని అలవర్చుకుని మంచి మార్గంలో నడువాలని హంపి పీఠాధిపతి విద్యారణ్య భారతి స్వామి అన్నారు. మండల కేంద్రంలోని పలుగుట్ట ప్రాంతంలో ముదిరాజ్ కుల సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఉత్సవాలలో భాగంగా శుక్రవారం కేదారీశ్వర ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ ఆధ్వర్యంలో పలు పూజలు నిర్వహించారు. అనంతరం మహిళలు బోనాలతో నందిపేటలో ఊరేగింపు చేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న హంపి పీఠాధిపతి, దేశ సంస్కృతి సంప్రదాయాల గొప్పతనం గురించి వివరించారు.



నందిపేటలో బోనాలు తీస్తున్న మహిళలు

చిచ్చు పెట్టాలనుకోవడం బాధాకరం



ఎడపల్లి(బోధన్): ధర్మారం సర్పంచ్ భర్త రవి రెండు గ్రామాల మధ్య చిచ్చు పెట్టడానికి యత్నించడం చాలా బాధాకరమని ఎంఎస్‌సీ ఫారం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఎంఎస్‌సీ ఫారంలో వారు మాట్లాడారు. గ్రామ సమీపంలో ఇటీవల కల్లు దుకాణం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. గతంలో ఎంఎస్‌సీ ఫారం గ్రామస్తులంతా, ధర్మారం గ్రామంలో ఉన్న కల్లు దుకాణానికి కల్లు సేవించడానికి వెళ్లేవారని, గ్రామంలో కల్లు దుకాణం ఏర్పాటు చేసుకోవడం వల్ల ధర్మారం గ్రామ కల్లు దుకాణంలో గిరాకీ తగ్గి వ్యాపారం కుంటుపడిందని అన్నారు. దీంతో ధర్మారం గ్రామ కల్లు వ్యాపారులు ఆ గ్రామ సర్పంచ్ భర్తతో కలిసి ఎంఎస్‌సీ ఫారం గ్రామ కల్లు దుకాణాన్ని తీసివేయించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ధర్మారం సర్పంచ్ భర్త అమాయకులను రెచ్చగొడుతున్నాడని, ఈ కారణంతో ఇరు గ్రామాల మధ్య గొడవలకు దారి తీసే అవకాశం ఉందని, పోలీసులు, అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు.

యాల్లరాములు స్ఫూర్తితో ముందుకు సాగుతా

- ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, యాల్ల రాములు కుటుంబ సభ్యులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మాజీ ఎంపీపీ యాల్ల రాములు స్ఫూర్తితో నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలో ఆలూర్ బైపాస్ రోడ్డు కూడలిలో యాల్లరాములు విగ్రహాన్ని ఆయన శుక్రవారం ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తన మేనమామ యాల్లరాములు కలలు కన్న బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని సాకారం చేసి రుణం తీర్చుకున్నానని అన్నారు. బైపాస్‌రోడ్డు ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యలు తీరి, భూముల విలువ పెరిగిందన్నారు. దివంగత రాములు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం తపించేవారని కొనియాడారు. బైపాస్‌రోడ్డుకు యాల్లరాములు చౌక్‌గా నామకరణం చేశారు. అలాగే యాల్లరాములు చౌక్ నుంచి ఆలూర్ రోడ్డు వరకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు, చౌక్ వద్ద బస్టాప్‌ను ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత, మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి, వైస్ చైర్మన్ షేక్‌మున్ను, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆశన్నగారి రాజేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో సగం నిధులు కేంద్రానివే



సమావేశంలో మాట్లాడుతున్న వినయ్‌రెడ్డి

మాక్లూర్: గ్రామాల అభివృద్ధిలో సగం నిధులు కేంద్ర ప్రభుత్వానివేనని బీజేపీ ఆర్మూర్ నియోజకవర్గం నాయకుడు పొద్దుటూరి వినయ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో మాణిక్‌భండార్ గ్రామంలో జరిగిన బీజేపీ కార్నర్ సమావేశానికి వినయ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 11 వేల బీజేపీ శక్తి కేంద్రాల ద్వారా కార్నర్ సమావేశాలను నిర్వహిస్తూ బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగడుతున్నట్టు చెప్పారు. గ్రామ స్థాయి నుంచి జరిగే ప్రతి అభివృద్ధి వెనుక కేంద్ర ప్రభుత్వ నిధులు ఉన్నాయన్నారు. గ్రామాల్లో నూతన పంచాయితీ భవనాలు, రైతు వేదికలు, శ్మశానవాటికల నిర్మాణం, మరుగుదొడ్లు, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులే కాకుండా ప్రతి అభివృద్ధి పథకంలో, రైతులకు ఇచ్చే సబ్సిడీలలో కేంద్ర నిధులు ఉన్నాయన్నారు. కొందరు బీఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేసి లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

అమర్యాదగా మాట్లాడడం సరికాదు



బోధన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితల పట్ల అమర్యాదగా మాట్లాడడం ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు సరికాదని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నాయకులు మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం హిందూత్వం పేరిట ప్రజలను మోసం చేస్తుందని, మతాలను, కులాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడి పబ్బం గడుపుతోందని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ కేసు గురించి తమకు అనుగుణంగా ఉన్న ఛానళ్ల ద్వారా కవిత పేరును ప్రస్తావనకు తెచ్చి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బోధన్ నియోజకవర్గానికి గడిచిన 3 ఏళ్లలో ఎంపీ, కేటాయించిన నిధుల గురించి చెప్పాలని డిమాండ్ చేశారు. ఆర్‌ఎస్ఎస్ వ్యవస్థాపకులు హెగ్డే పుట్టిన కందకుర్తి త్రివేణి సంగమానికి ఎన్ని నిధులు ఇచ్చి అభివృద్ధి చేశారో ఎంపీ చెప్పాలన్నారు. మరోసారి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పట్ల అనుచిత వాఖ్యలు చేస్తే సహించేది లేదని అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు రవీందర్ యాదవ్, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్ గిర్దావర్ గంగారెడ్డి, కౌన్సిలర్లు శరత్ రెడ్డి, రాధాకృష్ణ, పాల్, శ్రీకాంత్ గౌడ్, అబ్దుల్లా, పిట్ల సత్యం, గంగారం, ధూప్‌సింగ్, తదితరులు ఉన్నారు.

సనాతన సంప్రదాయాలను పరిరక్షించాలి



ఆలయంలో యజ్ఞం చేస్తున్న పిట్లకృష్ణ మహరాజ్

బోధన్‌టౌన్(బోధన్): హిందూ ధర్మంలో సనాతన సంప్రదాయాలను పరిరక్షించాల్సిన అవసరం ప్రతీ ఒక్క హిందువుపై ఉందని బాలయోగి, మల్లారం గుట్ట వ్యవస్థాపకులు పిట్ల కృష్ణ మహరాజ్ పేర్కొన్నారు. శుక్రవారం బస్వతారక్‌నగర్ కాలనీ కోట మైసమ్మ సహిత లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ 11వ వార్షికోత్సవానికి హాజరయ్యారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. నిర్మలమైన మనస్సుతో భగవంతున్ని ప్రార్థించాలని సూచించారు.

ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



హన్మాన్ ఆలయ ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి



ఆలయ కమిటీ సభ్యులను సన్మానిస్తున్న మంత్రి

రుద్రూర్: బొప్పాపూర్‌లో నూతనంగా నిర్మించిన ఆలయంలో దక్షిణముఖ సంజీవిని ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శుక్రవారం అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి హాజరై ఆలయ శిలాఫలకాన్ని ఆవిష్కరించి అనంతరం పూజలు చేశారు. బోధన్ ఆర్డీవో రాజేశ్వర్, బీఆర్ఎస్ నేత పోచారం సురేందర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బాపూజీ సావిత్రి లింగం పాల్గొన్నారు.

సరస్వతి విగ్రహం ఏర్పాటు

వర్ని: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సరస్వతి మాత విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో విగ్రహదాత దేశాయ్‌పేట్ కనుకంటి లీలావతి, కనుకంటి సాయన్న, డీఐఈవో రఘురాజ్, కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్మీ నరసింహ స్వామి నూతన ఆలయంలో..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో గురడి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన లక్ష్మీ నరసింహ స్వామి నూతన ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

సమాచారం..

కమ్మర్‌పల్లిలో రేపు ఉచిత వైద్య శిబిరం

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆశ సూపర్ స్పెషలిటీ ఆస్పత్రి(ఆర్మూర్) ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గడ్డం స్వామి, వీడీసీ అధ్యక్షుడు బద్దం రాజేష్ తెలిపారు.